# కథా, నవలా

## కొడవటిగంటి కుటుంబరావు

ఈనాటి తెలుగు సాహిత్యమంతటిలోకీ హెచ్చుగా పరిణామం చెంది యుగధర్మాన్ని సమగ్రంగా ప్రతిబింబిస్తున్నవి చిన్న కథా, నవలా అని ఒప్పుకు తీరాలి. కాని ఈ పరిస్థితి మన సాహిత్యం తాలూకు ఆధునికయుగం ఆరంభం నుంచీ ఉన్నటువంటిది కాదు. ఈ యుగం 19 వ శతాబ్దం చివరి భాగంలో, అక్కడా అక్కడా చెదురుగా వెలువడిన రచనలతో ఆరంభమై తొలిప్రపంచ యుద్ధం ముగిసేనాటికి ఒక ఉద్యమరూపం దాల్చింది. సాహితీ సమితి ప్రారంభమయే నాటికి ఉండిన రచయితలు ఆధునిక సాహిత్యయుగంలో నవశకం ఆరంభించారు.

అప్పటికి కూడా రచయితలలో హెచ్చుభాగం కవులే. కథకులూ, నవలాకారులూ ఉండేవారే గాని వారి సంఖ్య బహుతక్కువ. వచన రచన గ్రాంథికంలోనే నడిచేది. గిడుగు రామమూర్తిగారి వ్యావహారిక భాషావాదం నవ్యుల ఆమోదం పొందినప్పటికీ వ్యావహారికభాషను సాహిత్యానికి పూన్చేవారు అంతగా లేకపోయారు. తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగాన్ని ప్రారంభించిన అమర కవి గురజాడ వ్యావహారిక భాషలో పద్యాలూ, కథలూ, నాటకాలూ రాసినా కథల శకం ఆరంభమయేదాకా వ్యావహారిక భాషలో వ్యవసాయం ముమ్మరంగా సాగనే లేదు. కథల శకం పత్రికలతోబాటే పుట్టిపెరిగింది. పత్రికా పఠనం ప్రజలలో అభివృద్ధి చెందిన కొద్దీ కథల సంఖ్యా, కథకుల సంఖ్యా అభివృద్ధి అయింది.

పత్రికలు యంత్ర యుగానికి చెందినవి. అచ్చు యంత్రాలు చాలాకాలంగా ఉంటున్నా, ఈ యంత్రాలలో యిటీవల కలిగిన అభివృద్ధి చాలా గొప్పది. "సాహితి" సంచికలు అచ్చువేసిన ప్రెస్‌లో ట్రెడిల్ కూడా వుండేది

కాదు. ఈనాడు విస్తారమైన ప్రచారంగల రెండువార పత్రికలు రోటరీల మీద శరవేగంతో అచ్చవుతాయి. పూర్వం అయిదు పత్రికలున్నచోట ఇవాళ కనీసం నూరు పత్రికలున్నాయి. ఈ మార్పుల ఫలితాలు కథాసాహిత్యంమీద ఉండక తప్పదు.

గురజాడ అప్పారావుగారు రెండు కథలు మాత్రమే తెలుగులో రాశారు. నేను గడిచిన పాతిక ఏళ్ళకాలంలో అనేకవందల కథలు రాసి ఉంటాను. డజన్ల లెక్కనా, వందల లెక్కనా కథలు రాసినవారు ఆంధ్రలో చాలా మంది ఉన్నారు. ప్రచురించటానికి పత్రికలు లేకుండా ఇది సాధ్యం కాదు. పుస్తకాలు ప్రచురించి చేతి డబ్బు ముందు ఖర్చు చేసుకోవాలిసిన పరిస్థితిలో ఎవరూ వందల సంఖ్యలో కథలు రాయరు. పుస్తకాలు ప్రచురించి వాటిద్వారా కథకులుగా గణనకు రాగోరిన వారు ఎంతో మంచికథ అనీ, తప్పక రాసి తీరవలసిన కథ అనీ అనుకుంటే తప్ప రాయరు. పత్రికల ధర్మాన కథకులు ఒక మాదిరి కథలూ, అంత బాగా లేని కథలూకూడా రాయటం జరిగింది. వాటిని రాసినందువల్ల నష్టం లేదు. ప్రచురించే పత్రికలున్నాయి; ఒక్కొక్కప్పుడు పడిన శ్రమకు తృణమో పణమో ముట్టుతుంది కూడ!

ఇటువంటి కథలన్నీ రాసినందువల్ల కలిగిన లాభమేమిటని అడగవచ్చు. లాభం లేకపోలేదు. పత్రికలలో అచ్చయినంత మాత్రాన తక్కువరకం కథలకు సాహిత్య గౌరవం ఎన్నటికీ రాదు కాని పత్రికలను మేపటానికి వందల సంఖ్యలో కథకులు పుట్టుకురావటం తటస్థించింది. "ఉత్తమ సాహిత్యం అవుతుందా, లేదా?" అని ఆలోచిస్తూ కూర్చోకుండా పత్రికలు అనేక కథకుల కథలను, ఏదో ఒక సుగుణం చూసుకొని, ప్రచురించాయి. ఇందువల్ల చాలా చెత్తసాహిత్యం సృష్టి అయినప్పటికీ అనేకమంది కథకులు రచన చెయ్యటానికి ప్రోత్సాహం లభించిన వారైనారు. వారిలో కొందరు ఉత్తమ తరగతి కథకులుగా పరిణమించటం కూడా జరిగింది.

సాహిత్య రచన, అందులోనూ కథారచన, ఒక వృత్తి కాదు. ఈనాడు కూడానూ, ఉపాధ్యా

యులూ, జర్నలిస్టులూ, వైద్యులూ, గుమాస్తాలూ, వ్యాపారం చేసుకునే వాళ్లూ కథలు రాస్తున్నారు. ఇంకే సాహిత్యరూపంలోనూ కృషి చేయని వారు కేవలం కథలురాసి పేరు తెచ్చుకొనటం జరిగింది. అవతల వీరిని ప్రోత్సహించే పత్రికలే లేకపోతే వీరిలో నూటికి ఒకరు కూడా సాహిత్యం చాయలకువచ్చి ఉండరేమో!

ఇదే నవలలకుకూడా వర్తిస్తుంది. పత్రికలు విజృంభించక పూర్వం నవలలు రచించిన వారు చరిత్ర మీది మమకారం కొద్దీ, నవలలు రాసి అచ్చువేయించుకుని కీర్తీ, కొంత ధనమూ సంపాదించు తామనీ రచనచేశారు. పత్రికలలో ధారావాహినిగా నవలలు ప్రచురణ కాసాగిన అనంతరం నవలలు రాసే ప్రేరణ ఇతరులకు కూడా కలిగింది.

కథలూ, నవలలూ అభివృద్ధికి రావటంలో పత్రికలు నిర్వహించిన పాత్ర అనన్యమైనది. ఈనాడు కూడా పత్రికలు ప్రోత్సహించని సాహిత్యరూపాలు అడుగున పడి ఉండటం కనిపిస్తూనే ఉన్నది.

మంచిచెడ్డల విచక్షణ అటుంచి సాహిత్యం పరిమితంగా సృష్టి కావటంలోనూ, బహుళంగా సృష్టి కావటంలోనూ ఒక ముఖ్యమైన తేడా ఉన్నది. బహుళంగా ఉత్పత్తి అయే సాహిత్యం విధిగా ప్రజలకూ జీవితానికీ సన్నిహితంగా వచ్చి తీరుతుంది. కొద్దిమంది కథకులే ఉన్నప్పుడు వెలువడిన కథలలో పాత్రలను "ఉదాత్తం"గా ఉంచటానికి పడినపాట్లూ, వ్యావహారిక భాషలో రాయటానికి చేసిన ప్రయత్నంలో రచయితలను పట్టుకున్న బెరుకూ స్పష్టంగా గోచరిస్తాయి. రచయితలసంఖ్య హెచ్చిన కొద్దీ భాష ధారాళంగానూ, పాత్రలు స్వాభావికంగానూ పరిణమించటం జరిగింది. ఇది కథాసాహిత్యానికి జరిగిన సామూహిక లాభం. ఈ ప్రయోజనం ప్రత్యేక కథలలో పాక్షికంగా మాత్రమే ప్రతిబింబించింది.

అనాదిగా వచ్చే కథాసాహిత్యాన్ని పరిశీలించి నట్టయితే కథల యొక్క స్వరూప స్వభావాలలో పరిణామం కనిపిస్తుంది. పురాణాల లోని కథలు వాస్తవ గాధలు. వాటిలో అతిశయోక్తులుండవచ్చు.

వాటిని రాసినవారి అపోహలూ, మూఢ విశ్వాసాలూ ఒక్కొక్కప్పుడు వాటిలో ప్రతిబింబించి ఉండవచ్చు. కాని వాటిని రాసినవారు, అవి యదార్థ సంఘటనలనే విశ్వాసంతోనే వాటిని రాశారు. ఈ కథలను ఎవరో ఇంకెవరికో చెప్పారని మరెవరో వేరెవరికో చెప్పినట్టు పురాణకారులు రాశారు. అవి గత చరిత్రకు చెందిన దృష్టాంతాలుగా మాత్రమే రచించబడ్డాయి. కథకుడు ఆ కథలకు సాక్షి కాడు, సమకాలికుడు కూడా కాడు. ఈ కథలలో సామాజిక మనస్తత్వం ప్రతిబింబించదు.

వీటిమీద ఎంతో పరిణామం చెందినవి నీతి కథలు. అవి కేవలం కల్పితాలు. పక్షులమీదా, జంతువులమీదా పెట్టి మానవుల వ్యాపకాలను తీవ్రంగా విమర్శించిన వ్యంగ్య రచనలు. వీటిలో సామాజిక మనస్తత్వం పుష్కలంగా ఉన్నది.

ఆధునిక కథలు పురాణ కథలలాగా వాస్తవమైనవి కావు, నీతి కథలలాగా అభూత కల్పనలు కావు. ఇవి కల్పిత వాస్తవికత కథలు. స్వరూపాన్ని బట్టి ఈ కథలలో వాస్తవికత నూటికి నూరుపాళ్ళు ఉండవలసిందే, గత్యంతరం లేదు. ఈ వాస్తవికత కథనంలో, పాత్ర చిత్రణంలో, సంభాషణలో సంఘటనలలో ఉండి తీరాలి. వీటిలో మనస్తత్వానికి చాలా ప్రాముఖ్యం ఉన్నది. ఇవి పురాణ కథలలాగా ఒక ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని దృష్టాంతం కింద చెప్పుకునేవి కావు. నీతి కథలలోలాగా వీటిలో ఒక విస్పష్టమైన నీతి కూడా ఉండదు. వీటిలో జీవిత ఖండాలు ప్రతిబింబిస్తాయి—సమకాలిక జీవిత ఖండాలు.

ఇది చాలా ముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే, కథలు చెప్పటానికి మూడు మార్గాలున్నాయి. ఒకటి, ఎవరో చెప్పగా విన్న విషయాలు చెప్పటం; రెండు, కథకుడు తాను ప్రత్యక్షంగా చూసిన విషయాలు చెప్పటం; మూడు, కథకుడు తన అనుభవాలనే చెప్పటం. ఇందులో మొదటి పద్ధతి పురాణకథలలో కనిపిస్తుంది. మిగిలిన రెండూ ఆధునిక కథా సాహిత్యంలో అమలులో ఉన్నాయి. అందుచేత కథకుడు ఈనాడు విధిగా సమకాలిక సంఘటనలనే

చెప్పాలి. కథా సరిత్సాగరంలో చాలాచోట్ల తమ అనుభవాలను గురించి చెప్పటం మనకు కనిపిస్తుంది. ఇదే పద్ధతిని కాశీమజిలీలలో కూడా మనం చూస్తాం. అయితే అటువంటి కథలకు శ్రోతలు పాఠకులు కాదు — ఇతర పాత్రలు. ఆసాహిత్యంలో స్వానుభవాలు చెప్పించటం శిల్ప చమత్కృతి మాత్రమే.

ఈనాటి కథ - నవలకూడా - స్వరూపం సంబంధించినంతమట్టుకు పరిపూర్ణమైన పరిణామాన్ని సాధించింది. కథ చెప్పటానికి ఆదర్శప్రాయమైనదైన మాట్లాడే భాషలో ఈనాటికథలూ, నవలలూ రచించబడుతున్నాయి. వీటిలో ప్రధాన పాత్రలు ఈనాటి జీవితంలోని అన్ని తరగతులకూ చెందినవిగా ఉంటున్నాయి. వర్తమాన జీవితమే ఈ కథలలో, నవలల్లో ప్రతిబింబిస్తున్నది.

కాని ఈ రచనల స్వభావమే ఒక్కొక్కసారి పెడతోవ బడుతున్నది. కథలకూ, నవలలకూ వుండదగిన స్వభావం గురించి ఒక్కొక్కప్పుడు కథకులకే స్పష్టమైన అభిప్రాయాలుండటంలేదు.

ఆధునిక కథయొక్క స్వరూపాన్ని అర్థం చేసుకుని అటువంటి స్వరూపంగల సాహిత్యం ఎటువంటి స్వభావం కలిగి వుండాలో అంచనా కట్టటం అసాధ్యంకాదు. ప్రజలకు సన్నిహితమైన భాషలో ప్రజలను చైతన్యవంతులను చెయ్యలేని కథలు రచించి ప్రయోజనమేమిటి?

కందుకూరి వీరేశలింగంగారు మొదట్లో భాషతో గరిడీసాము చేసికూడా, పదిమందికీ తెలియవలసిన విషయాలు చెప్పటం కోసం అతిసులువైన భాష అవలంబించారు. ఆయనకు భాషతాలూకు స్వరూప స్వభావ సంబంధం తెలిసివచ్చింది. ఈనాటి కథకులు మట్టుకు ఒక్కొక్కప్పుడు అందరికీ అర్థమయే భాషలో దాదాపు ఎవరికీ అక్కర్లేని కథలు రాస్తున్నారు. ఇది తప్పు.

కథలలో నిత్యజీవితం తాలూకు పాత్రలుంటున్నాయి. కాని ఒక్కొక్కప్పుడు ఆ పాత్రల స్వరూపానికీ స్వభావానికి సంబంధం వుండదు. కార్మికుడికి మధ్యతరగతి మనస్తత్వమూ, మధ్యతరగతి వాడికి జమీందారీ మనస్తత్వమూ అంట

గట్టిపడుతుంది. ఈనాటి కథలలో జీవితం ప్రతిబింబించ బడుతుంది, కాని చాలా కథలలో జీవిత సత్యం లోపిస్తుంది.

ఈనాటి కథా సాహిత్యంలోని లోపాలన్నీ ఈ విధమైనవే. ఈ కథలకు ఆయువుపట్టు వాస్తవికత. వాటి స్వరూపం వాస్తవికతకు అనుకూలమైనది. అది కథలస్వభావంలో కూడా ప్రతిబింబించినప్పుడే అవి ఉత్తమ కథ లనిపించుకుంటాయి.

కథలలో, నవలల్లో ప్రతిబింబించే జీవితం తాలూకు వాస్తవికత, జీవిత సత్యం మాత్రమే. ఈ సత్యం వ్యక్తం కానప్పుడు జీవితాన్ని ఎంత వివరంగా చిత్రించి కూడా ఏమీ ప్రయోజనం లేదు. ఆ జీవిత సత్యమే రచనను అభ్యుదయ రచనగా చేసేది.

"జీవితసత్యం," "వాస్తవికత," "అభ్యుదయం" మొదలైనమాటలు రాజకీయ పరిభాష అని అపోహ పడే వాళ్ళు ఈనాడుకూడా చాలా మంది ఉండటం శోచనీయం. మార్క్సిస్టు సాహిత్యం పరిచయం లేకుండానే శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తాము రచించిన కొన్ని కథలలో జీవిత సత్యాలను ప్రతిభావంతంగా చిత్రించారు. ఒక కథలో ఒక అస్పృశ్యుడు ఇస్లాము మతం తీసుకుని సమాజం మధ్యకివచ్చి వెలి వెయ్యమని సవాలు చేస్తాడు. ఆయన రచించిన మరొక కథలో ఒక శ్రోత్రియ కుటుంబానికి చెందిన యువకుడు బతుకు తెరువు గానక హోటలు పెడతాడు. ఇదేవిధంగా, కమ్యూనిస్టు రాజకీయాలను తీవ్రంగా ప్రతిఘటించిన సురవరం ప్రతాపరెడ్డిగారు తమ కథలు కొన్నింటిలో జీవిత సత్యాన్ని చాలా చక్కగా చిత్రించారు. పాఠకులను సమ్మోహింప చేయటంలో అసాధారణ ప్రతిభగల చలంగారు జీవిత సత్యాన్ని అంతగా వ్యక్తం చెయ్యలేక పోయినా, జీవితంలోని అసత్యాలను ఘాటుగా ఖండించారు.

ఆధునిక యుగంలో అనేక మంది కథకులూ, నవలాకారులూ కూడా ఈ సాహిత్య రూపాల స్వభావాన్ని తృణీకరించి, స్వరూపాన్ని తీర్చి దిద్దటంలో ప్రావీణ్యం సంపాదించి ఖ్యాతి సంపాదించుకున్నారు. దీనికి మనం ఈ నాడు

విచారించనవసరంలేదు. ఎందు కంటే కథయొక్క స్వరూపంలో కలిగిన ఈ వాంఛనీయమైన పరిణామం ఏ ఉద్యమమూ లేకుండానే సాగింది. నవ్య సాహిత్య పరిషత్తు పుట్టి ఉద్యమం సాగించినప్పటికే చాలమంది ప్రసిద్ధ కథకులు దేశంలో ఏర్పడి ఉన్నారు. వీరిని కూడగట్టి ప్రచారం ఇవ్వటం తప్ప సాహిత్య పరిషత్తు వచన రచనల స్వభావాన్ని తీర్చిదిద్దటంలో ఎంత మాత్రమూ కృషి చేయలేక పోయింది. ఆ మాటకువస్తే నవ్య సాహిత్య పరిషత్తులో వచన రచయితలు ఎప్పుడూ వెనక బెంచీల మీదే కూచున్నారు.

వచన రచయితలను ముందుకు తోసి కథకులకూ, నవలలకూ, ఇతర సాహిత్య రూపాలకూకూడా ప్రయోజనాత్మకమైన స్వభావాన్ని ఇవ్వటానికి మొట్టమొదటి సారిగా ఉద్యమం సాగించినది అభ్యుదయ రచయితలసంఘం. ఈ ఉద్యమం కొంతదూరం సాగి పరిస్థితులు వికటించటంవల్ల తాత్కాలికంగా నిలిచిపోయినాక కూడా ఉద్యమ ప్రభావం ఎంతమాత్రమూ నిలిచి పోలేదు. గడచిన పదేళ్ళకాలంలో అనేక వందలమంది కథకులు తమ రచనలద్వారా జీవిత సత్యాన్ని వివరించటానికి కృషి చేశారు. వీరి రచనలు అన్ని పత్రికలలోనూ వెలువడ్డాయి.

ఈనాటి పరిస్థితి యేమంటే, యువక రచయితలకు కొంతమార్గ దర్శనం అవసరం. కొందరు కొందరు స్వరూపాన్ని గాలికి వదిలి కథయొక్క స్వభావానికి న్యాయం చేకూర్చాలనే ఆశతో వికృతమైన రచనలు చేస్తున్నారు. మరికొందరు వాస్తవాన్ని వాస్తవికతగా భావించి తృప్తిపడుతున్నారు. మరి కొందరు కొన్ని అభ్యుదయకర విశ్వాసాల యందు అపారమైన గురివుండి, వాటిని నిరూపించటం కోసం జీవితాన్ని తారుమారు చేసి చిత్రిస్తున్నారు.

రచయితకు జీవితానుభవం వుండాలి. జీవితసత్యాన్ని గ్రహించే నిశితమైన దృష్టి వుండాలి. ఏ కళకైనా అపారమైన సాధనవుండాలి. వాస్తవిక కళలకు మరీనూ.

ముందుకు చూస్తే కథా, నవలా సాహిత్యాలకు ఉజ్వలమైన భవిష్యత్తు కనిపిస్తుంది. భావిసాంఘిక పరిణామానికి మూలకందమైన

శ్రామిక వర్గంలో యింకా కళా చైతన్యం లేదు. కాని వస్తుంది. జీవితసత్యం తాళాలు కీలకం వారి చేతిలో వుంది. వారిలోనుంచి కథకులూ, నవలాకారులూ బయలుదేరి తమ జీవితాన్నీ, దానివెనక దాగివుండే సత్యాన్నీ చిత్రించటం ప్రారంభించినాక యీనాడు మనం చూసి మురిసే సాహిత్యం పేలపిండి లాగా గోచరిస్తుంది. ఆవర్గంనుంచి గోర్కీలూ, ఫాస్ట్‌లూ, హోర్ట్‌లూ బయలుదేరే రోజు ఆటేదూరం లేదు. అభ్యుదయ రచయితల సంఘం సరిఅయిన పంథాలో కృషి చేసినట్లయితే, యీకృషికి సంఘం నాలుగు మూలలనుంచీ ప్రోత్సాహం లభించినట్లయితే ఆ రోజు మరింత దగ్గరపడి తీరుతుంది.